నిండుకుండలా చెరువులు

- యాసంగికి డోకా లేదంటున్న రైతులు
- ఆనందం వ్యక్తంచేస్తున్న అన్నదాతలు



నిండుకుండలా పెద్ద చెరువు

టేకుమట్ల : మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని చెరువులు, కుంటలు 56కు పైనే ఉన్నాయి..వాటికింద 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువులు 30వరకు ఉంటాయి. కుంటలు, చెరువుల ఆయకట్టులో వానాకాలం సుమారు 8వేలకు పైగా ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా లేకపోయినా, తర్వాత భారీ వర్షాలు కురవడంతో కుంటలు, చెరువులు పూర్తిగా నిండిపోయి జలకళ సంతరించుకుంది. దీంతో మండలంలోని సుమారు పది చెరువుల పరిధిలోని ఆయకట్టు రైతులు వానాకాలంలో వరి పంటను సాగు చేస్తున్నారు. వానాకాలం పూర్తి కావొస్తున్న తరుణంలో యాసంగికి ఎదురు చూసే రైతులకు చెరువులు నిండుకుండలా దర్శనమివ్వడంతో యాసంగి వరిసాగుకు డోకా లేదంటూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలోని చెరువుతో పాటు, వెలిశాల, రామకిష్టాపూర్(టి), గర్మిళ్లపల్లి, దుబ్యాల, వెల్లంపల్లి, పంగిడిపల్లి, రాఘవరెడ్డిపేట, వెంకట్రావుపల్లి తదితర చెరువుల ఆయకట్టు రైతులు యాసంగికి సిద్ధంగా ఉన్నారు.

సన్నాలు, దొడ్డు రకాల వైపు మొగ్గు..

గతంలో ఎక్కువగా రైతులు తెగుళ్ల బారీనుంచి తట్టుకోలేక దొడ్డు రకాలనే పండించే వారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యంపై క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తుందనడంతో రైతులు రెండు రకాల వరి పంటలను పండించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో దొడ్డు రకాలను పండించి, తినేందుకు సన్నాలను కొనే వారు. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారింది. తెగుళ్లను సైతం లెక్క చేయకుండా పంటలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి వరి పంటలను పండిస్తున్నారు. దీంతో సన్నబియ్యం ధరలు ప్రతీ ఒక్కరికి అందుబాటులోకి రానున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సన్నాలు సాగుచేస్తున్నా..



“ సొంతంగా భూమి లేకున్నా మండల కేంద్రంలోని పెద్ద చెరువు కింద ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నా. చెరువులో నీళ్ల పుష్కలంగా ఉండడంతో యాసంగికి రంది లేదు. దోపసల్ పంటలను పండిస్తున్నా. వానాకాలం, ఎండకాలంలో సన్నాలనే సాగు చేస్తున్నా మంచి లాభాలను అందుకుంటున్నా.

- శాస్త్రాల కిరణ్, కౌలు రైతు,పంగిడిపల్లి

సాగునీటికి డోకాలేదు



చెరువులో నీళ్ల సమృద్ధిగా ఉండడంతో యాసంగి పంటకు సాగునీటి సమస్య లేకుండా ఉంది. నాకున్న ఎకరంన్నర పొలంలో వానాకాలం వరి పంట సాగు చేశాను. కోతదశకు చేరుకుంది. వెంటనే యాసంగికి సిద్ధంగా ఉన్నా. చెరువులో నీళ్ల ఉండడంతో దోపసలీకి డోకాలేదని అనుకుంటున్నా. పంట కూడా బాగానే వస్తుంది.

- మాదిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, రైతు, వెల్లంపల్లి

‘గెజిటెడ్’ నిబంధన తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాటారం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ సర్టిఫికెట్స్ కాపీపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించాలనే నిబంధనను తొలగించాలని కోరుతూ మండల ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో ఫాం–18, 19 నింపిన వారి దరఖాస్తులు సంబంధిత బీఎల్‌ఓలతో వ్యక్తిగతంగా వెరిఫికేషన్ చేయించి ఓటు నమోదు కల్పించాలని కోరారు. ఫిజికల్ అటెస్టేషన్ కాపీ అడగడం వల్ల దూరభారం, సమయభావం వల్ల అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని తహసీల్దార్‌కు వివరించారు. ఫిజికల్ పత్రంపై గెజిటెడ్ సంతకం అటెస్టేషన్ చేయాలనే నిబంధనను తొలగించి వేరిఫికేషన్ ప్రక్రియ ద్వారా ఓటు నమోదుకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బొల్లం సతీశ్, గండు రాజబాబు, అనపర్తి తిరుపతి, నడిపెల్లి సురేశ్‌రావు, హట్కర్ రమేశ్‌నాయక్, దేవునాయక్, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

సర్వే విధుల్లోకి తీసుకోకపోవడం బాధాకరం



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కాటారం : సామాజిక, ఆర్థిక సమగ్ర సర్వేలో భాగంగా తమకు ఒక రోజు శిక్షణ ఇచ్చి తర్వాత విధుల్లోకి తీసుకోకపోవడం బాధాకరమని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. ఇకనుంచి తాము అంగన్‌వాడీ విధులు తప్ప మరే విధులు నిర్వర్తించబోమని మంగళవారం తహసీల్దార్ నాగరాజుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ గ్రామాల్లో ఉంటూ అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యతతో పాటు స్థానికంగా జరిగే ప్రతి సర్వే, గ్రామ సభలు, బీఎల్‌ఓ, ఎలక్షన్ విధులు నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు. సామాజిక సర్వే కోసం తమకు ఒక రోజు ట్రెనింగ్ ఇచ్చి ఇప్పుడు పక్కన పెట్టి ఎస్జీటీలను సర్వే విధుల్లోకి తీసుకోవడం తమకు అవమానకరం అన్నారు. ఇకనుంచి తాము అంగన్‌వాడీ విధులు తప్ప బీఎల్‌ఓ, ఇతర విధులు చేయబోమని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, స్వప్న, సువర్ణ, పుష్ప, శ్రీలత, క్రిష్ణవేణి, సుమతి, సునీత, తదితరులు ఉన్నారు.

మహదేవపూర్‌లో కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న ఎస్సై పవన్‌కుమార్

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలో స్థానిక పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. మంగళవారం గ్రామంలో ఎస్సై పవన్‌కుమాఆర్ ఆధ్వర్యంలో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఏమైనా కనిపిస్తే వాటి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. నంబర్ ప్లేటు లేని వాహనాలను గుర్తించి వాటికి జరిమానా విధించారు. అనంతరం గ్రామ సెంటర్ వద్ద స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని, గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిషేధిత పదార్థాలు, గుడుంబాను ప్రోత్సహించవద్దని, ఒకవేళ ఎవరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులు, హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుళ్లు కిషన్, చంద్రమోహన్, వెంకటేష్ తెలంగాణ స్పెషల్ పోలీసులు, హోంగార్డులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



మల్హర్ : నాగులమ్మ ఆలయం వద్ద భక్తులు



చిట్యాల: పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



టేకుమట్లలో పుట్ట వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

మల్హర్ : మండలంలో పలు గ్రామాల్లో నాగులచవితి వేడుకలను మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కొయ్యూరు నాగులమ్మ పుట్ట వద్దకు మండలంలో వివిధ గ్రామాలతో పాటు చుట్టు పక్కల నుంచి అధిక సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. పుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే నాగులమ్మను దర్శంచుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిట్యాల : మండలంలోని ఆయా గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను భక్తులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నాగదేవత వద్ద పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కృష్ణమూర్తి చార్యులు, భక్తులు సంతోష్, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టలో పాలుపోసి, పూలు, పండ్లను సమర్పించారు. అలాగే శివాలయాల్లో కుటుంబ సమేతంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేగొండ : మండలంలోని కొడవటంచ ఆలయంలో నాగుల చవితి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో పూజలు చేయడంతో పాటు పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. నాగుల చవితి సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భూపాలపల్లి అర్బన్ : కార్తీక మాసం నాగుల చవితిని పురస్కరించుకొని మంగళవారం చవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయం, పైలెట్ కాలనీలోని సింగరేణి గెస్ట్‌హౌజ్ ఎదురుగా ఉన్న పుట్టలు, జంటనాగులపై భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

బీసీల సమస్యలపై స్పందించాలి



తీన్మార్ మల్లన్నను కలిసిన బీసీ సంఘం నాయకుల

కాటారం/కాళేశ్వరం : కాటారం సబ్ డివిజన్ పరిధిలోని బీసీ సంఘాల నాయకులు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనలో భాగంగా తలెత్తే ఇబ్బందులు, బీసీ సమస్యలను కృష్ణయ్య, మల్లన్న దృష్టికి తీసుకెళ్లినట్లు సంఘాల నాయకులు తెలిపారు. కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో నివసిస్తున్న రెడ్డిగాండ్ల కులస్తులు బీసీలు కాదని గతంలో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసి తేల్చిందని వారికి వివరించినట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న కులగణనలో మళ్లీ వారు బీసీలుగా గుర్తించబడాలని ప్రయత్నం చేస్తున్నారని వారు ఎట్టి పరిస్థితుల్లో బీసీలు పరిగణించబడకుండా చూడాలని కోరినట్లు నాయకులు పేర్కొన్నారు. దీనికి కృష్ణయ్య, మల్లన్న సానుకూలంగా స్పందించి బీసీలకు అన్యాయం జరగకుండా తమవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కాటారం సబ్ డివిజన్ అధ్యక్షుడు నిడిగొండ మైనర్ బాబు, కుమ్మరి సంఘం నాయకులు సముద్రాల తిరుపతి, నాయీబ్రహ్మణ సంఘం నాయకులు విజయగిరి సమ్మయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు గద్దం స్వామి, యాదవసంఘం నాయకులు స్వామి యాదవ్ తదితరులు ఉన్నారు.

సైబర్ ఉచ్చులో యువకుడు

- రూ.2,15,000 పోగొట్టుకున్న వైనం

రేగొండ : సైబర్ మోసగాళ్ల ఉచ్చులో చిక్కిన ఓ యువకుడు ఏకంగా రూ.2,15,000 పోగొట్టుకున్న ఘటన కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అజ్మీర గణేశ్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో గత నెలలో తన మొబైల్‌లో వాట్సాప్ చూస్తున్న క్రమంలో వచ్చిన మెసెజ్‌ను చూసి టెలిగ్రామ్ గ్రూప్‌లో జాయిన్ అయ్యాడు. తాను చెల్లించిన డబ్బులకు 30 శాతం అదనంగా వస్తాయాని అవతలి నుంచి సైబర్ నేరగాడు ఆశ చూపించాడు. కాగా ఆ మెసెజ్‌లను నమ్మిన గణేష్ రూ.2,15,000 నగదును విడతల వారిగా పంపించాడు. కాగా తాను మోసపోయానని గ్రహించి సైబర్ టోల్ ఫ్రీ నంబర్ 1930 కు ఫోన్ చేశాడు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. డబ్బు ఆశ చూపే వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎస్సై సూచించారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై అభినవ్

కాటారం : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని సీసీ కెమెరాల సహాయంతో 24 గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై మ్యాక అభినవ్ వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలోని గంటగూడెనికి చెందిన గంట పరిపూర్ణం జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతుంటాడు. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి గురుకుల కళాశాల కంప్యూటర్ ల్యాబ్ తాళం పగలగొట్టి ఎల్‌ఈడీ టీవీ దొంగలించాడు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో నిందితుడు పరిపూర్ణంగా గుర్తించారు. మంగళవారం ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని తన ఇంటి వద్ద పట్టుకొని దొంగలించిన టీవీని స్వాధీనం చేసుకున్నారు. జల్సాల కోసం డబ్బు లేక దొంగతనానికి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కాగా నిందితుడు పరిపూర్ణం గతంలో ట్రాక్టర్ బ్యాటరీల దొంగతనం, గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇటీవలే జైలు నుంచి బెయిల్‌పై విడుదలై ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ సమావేశంలో కానిస్టేబుళ్లు లవన్, సంపత్, నాగరాజు, రఘు, నరేశ్, హోంగార్డ్స్ తిరుపతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రేపటి ఆత్మీయ సన్మానానికి తరలిరావాలి



మాట్లాడుతున్న రెడ్డిగాండ్ల కులస్తులు

కాళేశ్వరం : తెలంగాణ రాష్ట్ర పార్టీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి ఆత్మీయ సన్మానం కార్యక్రమం ఈనెల 7న రెడ్డి గాండ్ల (గాండ్ల) కుల సంఘం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు మహదేవపూర్ పీఏసీఎస్ చైర్మన్, ఆ సంఘం నాయకులు చల్ల తిరుపతి తెలిపారు. మంగళవారం ఆయన మహదేవపూర్‌లో మాట్లాడుతూ..ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు గాండ్ల కులస్తునికి ఇవ్వడం అదృష్టమని, ఐకమత్యంగా ఉండాలన్నారు. ఈనెల 7వ తేదీ (గురువారం) కాటారంలోని బీఎల్‌ఎం గార్డెన్‌లో చైర్మన్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు హాజరుకానున్నారన్నారు. సన్మానానికి రెడ్డిగాండ్ల (గాండ్ల) కులస్తులందరూ అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు నిర్వహణ కమిటీ రెడ్డి గాండ్ల (గాండ్ల)బంధువులు పాల్గొన్నారు. అంతకు ముందు రెడ్డి గాండ్ల (గాండ్ల)కుల సంఘం ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పోటు మల్లారెడ్డి, అయిత రాజిరెడ్డి, అయిత రమేశ్, కేశవ రెడ్డి, అంకి రెడ్డి, చీర్ల చంద్రశేఖర్, శ్రీనివాస్, మద్కు వెంకట్, వెన్నపురెడ్డి దేవేందర్, పుప్పిరెడ్డి రంజిత్, గద్దె సమ్మిరెడ్డి, కుంభం రమేశ్‌పాల్గొనారు.

సర్వేకు సహకరించాలి

ఏటూరునాగారం : ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కోరారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో కాంగ్రెస్ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ నేటినుంచి ప్రారంభమయే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల నమోదులో కాంగ్రెస్ శ్రేణులు తప్పకుండా పాల్గొని అధికారులతో సహకారం చర్యలు అందించాలన్నారు.నాయకులు, యువత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజుయాదవ్

ములుగు రూరల్ : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకునే క్రమంలో దళారులను నమ్మి మోసపోకూడదని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ములుగు వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కాశిందేవిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు రైతులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలన్నారు. ‘ఏ’ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,320, ‘బి’ గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 చెల్లిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 33 రకాల సన్న ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అహ్మద్‌పాషా, మండల అధ్యక్షుడు చాంద్ పాషా, డైరెక్టర్లు, రైతులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఊకే ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సీపీఎం మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఎం ఆధ్వర్యంలో మండలంలో అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి గిరిజనులకు హక్కు పత్రాలు వచ్చేదాకా పోరాటాలు చేశామన్నారు. ప్రభుత్వం వంద రోజుల్లో అన్ని వాగ్దానాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన నేటికి అమలు చేయలేదన్నారు. రూ.2లక్షల రుణమాఫీ రైతులందరికీ వర్తించలేదన్నారు. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని అమలు చేయకుండా కొర్రీలు పెడుతోందన్నారు. మహిళలకు రూ. 2,500 ఇస్తామన్న హామీ కూడా జాడలేదన్నారు. హామీల అమలుకు ప్రజలను సమీకరించి భవిష్యత్‌లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ముందుగా మండల కేంద్రంలో పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బిరెడ్డి సాంబశివ, జిల్లా కమిటీ సభ్యుడు రాజేష్, నాయకులు దాసరి కృష్ణ, ఊకే నాగేశ్వరరావు, తాటికొండ శంకర్, సత్యనారాయణ అల్లం అశోక్, పాయం నారాయణ, భవననిర్మాణ కార్మిక సంఘ నాయకులు శ్రీనివాస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

డైట్ చార్జీల పెంపు హర్షణీయం



ములుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం హర్షణీయమని ఇంచర్ల గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో ఉన్న ప్లకార్డును పట్టుకొని కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.2,100 పెంచిందని అన్నారు. గతంలో విద్యార్థులకు రూ.1,500 చెల్లించేదని పేర్కొన్నారు. కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు.

క్లుప్తంగా

‘నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి’

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలో భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీ నిరుపేదలకు ఇంటి స్థలాలకు భూమిని కేటాయించాలని మహదేవపూర్ తహసీల్దార్‌కు ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ లింగాల రామయ్య, మండల అధ్యక్షుడు మేరుగు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మోటం వెంకటేశ్వర్లు, సయుక్త కార్యదర్శి కొండపల్లి రాములు, సురేష్, మల్లయ్య పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

మొగుళ్లపల్లి : మండల కేంద్రములో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంగళవారం మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పెద్దమ్మతల్లి దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.ముదిరాజుల సంక్షేమానికి ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చదువు అన్నారెడ్డి, కోడారి రమేష్, జోరుక సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం పంచాయతీ పరిధిలోని ఇప్పలబోరు గ్రామానికి చెందిన పిట్టల సత్యం ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై చక్రపాణి ప్రత్యేక పోర్టల్ ద్వారా నంబర్ బ్లాక్ చేశారు. మంగళవారం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఏఎస్సై రాజేశం, కానిస్టేబుల్ రమేశ్ బాధితుడికి అందజేశారు.

బైక్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

కాటారం : మండల కేంద్రానికి చెందిన కొండగొర్ల సమ్మయ్య మంగళవారం తన బైక్‌పై మంథని రోడ్డు వైపుగా గల పెట్రోల్‌బంకుకు వెళ్తున్నాడు. సమ్మయ్య ప్రధాన రహదారిపై నుంచి పెట్రోల్‌బంక్‌లోకి తన ద్విచక్ర వాహనంతో టర్న్ తీసుకోగా వెనకాలే వచ్చిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీ కొట్టింది. దీంతో సమ్మయ్య తీవ్ర గాయాలపాలవగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై పోలీసులను అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలి

కాటారం : ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలని ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా మండల వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణికి, సుఖ రోగాలు, టీబీ ఉన్న వారికి తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తులను ఆదరించి సక్రమంగా ఏఆర్‌టీ మందులు వాడేలా రోగులకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, సిహెచ్ఓ నిర్మల, సూపర్‌వైజర్లు పద్మావతి, సరళ, టీబీ సూపర్‌వైజర్ రమేశ్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

భూపాలపల్లి అర్బన్ : జవహర్‌నగర్‌కాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. జవహర్‌నగర్ కాలనీకి చెందిన మాలోత్ రవి ఇంటి ఆవరణలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.22,110వేల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వివరించారు.

పరామర్శ



రేగొండ (కొత్తపల్లిగోరి) : కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లి గ్రామానికి చెందిన కొత్త అమృతమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు జూపాక నీలాంబరం, లెంకల రాజిరెడ్డి, పసుల అశోక్ భిక్షపతి, సమ్మిరెడ్డి, సమ్మయ్య, శోభన్ ఉన్నారు.

రేగొండ : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన ఏడుసూతుల శశిరేఖ, గణపాక సూరమ్మ ఇటీవల మరణించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, నాయకులు హింగే మహేందర్, కొలేపాక భిక్షపతి, బండి రమేష్ తదితరులు ఉన్నారు.